క్లుప్తంగా

మేడారం భక్తులకు మాస్కుల అందజేత



నర్సంపేట : మేడారం జాతరకు వెళ్తున్న భక్తులకు నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై శీలం రవి గురువారం మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. మేడారం జాతరకు వెళ్తున్న భక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. తద్వారా చర్మ వ్యాధులు, ఎలర్జీ నుంచి కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వాలంటీర్లు భానోత్ నాగరాజు, భలభక్తుల ఆదర్శ్, గట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్



నర్సంపేట రూరల్ : మండలంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, హెడ్ హమీద్ పాషాకు బెంగుళూర్‌కు చెందిన విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ జానకి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ హదీమని పర్యవేక్షణలో హమీద్ పాషా పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో 'డిజైన్ ఆఫ్ డిస్టెన్స్ బేస్డ్ కంటెంట్ అడ్రసెబుల్ మెమొరీ యూజింగ్ డబుల్ గేట్ మెస్ఫెట్' అంశంపై హమీద్ పాషా సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి గాను డాక్టరేట్ వచ్చిందని వివరించారు. ఈ సందర్భంగా హమీద్ పాషాను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

28న వైస్ ఎంపీపీ ఎన్నిక

నెక్కొండ : ఈనెల 28న వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తామని ఎన్నికల అధికారి నర్సింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. రెండేళ్ల క్రితం వైస్ ఎంపీపీ రామారపు పుండరీకం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలి సిందే. నాటి నుంచి వైస్‌ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించలేదు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఉదయం 11 గంటలలోపు నామినేషన్ పత్రం సమర్పించాలని నర్సింహారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నామినేషన్ పత్రాల పరిశీలన, మధ్యాహ్నం 2 గంటల వరకు ఉపసంహరణ గడువు ఉంటుందని పేర్కొన్నారు. తదనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను వెల్లడించి వైస్ ఎంపీపీని ఎన్నుకోనున్నట్లు వివరించారు. ఏవైనా కారణాల చేత ఎన్నిక జరగకపోతే మరుసటి రోజు (29న) నిర్వహిస్తామని పేర్కొన్నారు.

టెంట్ సామగ్రి వితరణ



నర్సంపేట : పట్టణంలోని మార్కండేయ కాలనీవాసులకు గోకా లీలావతి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోక వినోద్ ఆధ్వర్యంలో గోక లీలావతి జ్ఞాపకార్థం ట్రస్ట్ అధ్యక్షుడు గోకా రామస్వామి టెంట్ సామగ్రి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడారు. కాలనీవాసులకు ఉపయోగపడేలా వంట సామగ్రి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన పోగులకొండ సోమయ్య, గూడెల్లి శ్రీనివాస్, బురహాన్‌పల్లికి చెందిన కుశ బుచ్చిరెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎంపీటీసీ ఐత రాంచందర్, ఎండీ నయీం, మల్యాల నర్సింహమూర్తి, రామారావు, గారె నర్సయ్య, తదితరులున్నారు.

వీధులన్నీ నిర్మానుష్యం

ఖిలా వరంగల్: ఆసియా ఖండంలోని అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ మహా కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివెళ్తున్నారు. ఈక్రమంలో డివిజన్లలోని వాడలన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ప్రత్యేక వాహనాలు, బస్సుల్లో జాతర తరలివెళ్తున్నారు.

పులకించిన మద్ది మేడారం

గద్దెకు చేరిన సమ్మక్క

- 3 లక్షలకుపైగా భక్తుల రాక
- తల్లులను దర్శించుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మద్దిమేడారంలో కొలువుదీరిన సమ్మక్క తల్లి



టేకుల మేడారంలో సమ్మక్క తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నల్లబెల్లి : తల్లుల రాకతో మద్దిమేడారం జాతర భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. శివసత్తుల పూనకాలు, భక్తుల కేరింతల నడుమ జెండాగట్టు నుంచి సమ్మక్కను పూజరులు తీసుకురావడం ఉద్విగ్నభరితంగా సాగింది. పోలీసుల రక్షణ వలయంలో సమ్మక్కను పూజారులు గురువారం సాయంత్రం గద్దె మీదకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. ఆ సమయంలో శివసత్తుల పూనకాలు, ఎదుర్కోళ్ల మొక్కుల కోలాహాలం.. వరాలు పట్టడం అలరించాయి. ఏ చెట్టూ.. ఏ పుట్టా చూసినా జాతర ప్రాంగణం భక్తజనంతో నిండిపోయింది. మండలంలోని కొండాపూర్ శివారులోని జెండాగట్టు అటవీ ప్రాంతం నుంచి ఆలయ ప్రధాన పూజారి దురిశెట్టి నాగరాజుతోపాటు పలువురు పూజారులు వెళ్లి 3 గంటలపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెండాగట్టుకు మేకను బలి ఇచ్చి కుంకుమ భరణి, లంక బియ్యం పెట్టి తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను చేత పట్టుకొని సమ్మక్క ప్రధాన పూజారి నాగరాజు పోలీసుల రక్షణ వలయంలో సమ్మక్క తల్లిని కాలినడకన శివసత్తు చిందులు, భక్తుల కేరింతలు, డోలు వాయిద్యాలతో బయలుదేరారు. తర్వాత పగిడిద్దరాజు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి సమ్మక్కను సాయంత్రం 5.25 గంటలకు గద్దెపైకి చేర్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఏసీపీ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో నర్సంపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సమ్మక్క-సారలమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తులు తల్లులను దర్శించుకొని పరవశించిపోయారు. భక్తులు తల్లులకు ఎత్తు బంగారం, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. బుధవారం రాత్రి సారలమ్మ గద్దెకు చేరుకోగా గురువారం సమ్మక్క తల్లి గద్దెకు రానుండడంతో రాత్రి నుంచే జనాలు ఎడ్లబండ్లు, వాహనాల్లో జాతరకు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే మద్దిమేడారం భక్తులతో కిటకిటలాడింది.

తల్లులను దర్శించుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

మద్దిమేడారం, టేకుల మేడారంలో వనదేవతలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్లు గాదె సుదర్శన్ రెడ్డి, సదానందం ఆధ్వర్యంలో ప్రధాన పూజారులు డోలు వాయిద్యాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం సమ్మక్క-సారలమ్మలకు మొక్కులు చెల్లించారు. ఆయన వెంట నాయకులు ఏదాకుల సంపత్‌రెడ్డి, మాలోత్ చరణ్‌సింగ్, జిల్లా మునేందర్, దుంపల ఇంద్రారెడ్డి, ద్యాగల కృష్ణ, ఇస్తారి శేఖర్, మాలోత్ మోహన్, జెట్టి రామ్మూర్తి, బత్తిని మల్లయ్య, బత్తిని మహేశ్ ఉన్నారు.

మూడు లక్షలకుపైగా భక్తుల రాక

సమ్మక్క-సారలమ్మ గద్దెలకు చేరుకోవడంతో బుధ, గురువారాల్లో సుమారు మూడు లక్షల మందికిపైగా భక్తులు జాతరకు హాజరయ్యారని అధికారులు అంచనా వేస్తున్నారు. గత జాతర కంటే భక్తులు ఈసారి అధిక సంఖ్యలో హాజరుకావడంపై ఆలయ కమిటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి కోసం ఆందోళన



నిరసన తెలుపుతున్న మహిళలు

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలోని ఎస్సీ కాలనీ మహిళలు తాగునీటి కోసం గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలుగా తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. కాలనీలో రెండు బోర్లు ఉన్నప్పటికీ అవి రెండు నెలలు చెడిపోయాయని వాపోయారు. మిషన్ భగీరథ నీరు సైతం రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. వంట చేయడానికి, స్నానానికీ, ఇతర అత్యవసరాలకు సైతం అల్లాడుతున్నట్టు చెప్పారు. గత్యంతరం లేక వ్యవసాయ భూముల్లోని బోరు బావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని మహిళలు తెలిపారు. అధికారులు చొరవ తీసుకొని రెండు బోర్లకు మరమ్మతులు చేయించడంతోపాటు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని మహిళలు స్పష్టం చేశారు. ఆందోళనలో నర్సమ్మ, సునీత, జహరా బేగం, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజాసంక్షేమానికి బాటలు



సమావేశంలో మాట్లాడుతున్న రాంగోపాల్

నర్సంపేట : బీజేపీతోనే ప్రజల సంక్షేమానికి బాటలు పడతాయని ఆ పార్టీ అనుబంధ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు బాల్నె జగన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో నర్సింహరాములు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధిలో దూసుకుపోతోందని తెలిపారు. ప్రధాని మోడీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అవసరమైన పథకాలు చేపట్టడంతోపాటు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. మరోసారి కేంద్రంలో పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 28న పట్టణంలో తలపెట్టిన విజయ సంకల్ప యాత్రకు భారీగా తరలిరావాలని కోరారు. ప్రధాని మోడీ సాధిస్తున్న విజయాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలని తెలిపారు. 'ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్' నినాదాన్ని శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని చెప్పారు. సమావేశంలో బీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు కందికొండ శ్రీను, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ ఠాకూర్ శివంజన్‌సింగ్, బూత్ అధ్యక్షులు సామల ప్రవీణ్, ఠాకూర్ విజయ్‌సింగ్, కందికొండ ప్రభాకర్, తోటం నిశాంత్, రవి, రవీంద్రచారి, నాయకులు మామిడి హైమవతి, మార్త సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

'సీఏ'తో మెరుగైన ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న చైర్మన్ హరికృష్ణ

చెన్నారావుపేట : చార్టర్డ్‌అకౌంటెన్సీ (సీఏ) కోర్సు చదివితే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐసీఏఐ సంస్థ చైర్మన్ సీహెచ్.హరికృష్ణ తెలిపారు. మండలంలోని అమీనాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో సీఏ విద్య అభ్యసించిన వ్యక్తులు ఉన్నత స్థానానికి చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. చార్టర్డ్ అకౌంటెన్సీ రంగంలో ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే విద్యార్థులు చార్టర్డ్ అకౌంటెన్సీ అభ్యసించేలా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తున్నట్లు తెలిపారు. సదస్సులో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, కామర్స్ అధ్యాపకులు రవిశంకర్, సంస్థ సభ్యులు రాజేశ్, హరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ తనిఖీ



దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను ఎంపీడీఓ లెక్కల అరుంధతి గురువారం తనిఖీ చేశారు. జమ-ఖర్చులు, ఎంబీ రికార్డులు, జీపీ తీర్మానాలు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. మట్టి నింపిన బ్యాగుల్లో విత్తనాలు వేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చెప్పారు. నాటిన అన్ని విత్తనాలు మొలకెత్తేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వాణి, ఫీల్డ్ సిస్టెంట్, వన సేవక్‌లు పాల్గొన్నారు.

శ్రేష్ఠ-2024 వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, తదితరులు

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 5 నుంచి 7 వరకు శ్రేష్ఠ-2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం ఆయన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, కన్వీనర్ మంద శ్రీధర్, అకడమిక్ డీన్ నారాయణ, ఏట సురేశ్, ఫణీంద్ర, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతిలో ఉపాధ్యాయులు కీలకం

చెన్నారావుపేట : విద్యార్థుల ఉన్నతిలో ఉపాధ్యాయులు కీలకమని ఎంఈఓ రత్నాల తెలిపారు. మండలంలోని తొర్రగుట్టతండాలోని, పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆమె సందర్శించి రిజిస్టర్లను, ఎఫ్ఎల్ఎన్ రికార్డులను, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని చెప్పారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా మెరుగైన విద్యాబోధన అందించాలని తెలిపారు. మెనూను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపమ్మ, హెచ్‌ఎం రియాజుద్దీన్, సీఆర్పీ స్వామి, మెసేంజర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై పోలీసుల దాడిని ఖండించాలి



మాట్లాడుతున్న వల్లందాసు కుమార్

వర్ధన్నపేట/పర్వతగిరి : పంజాబ్ హర్యానా సరిహద్దులోని ఖినోరీ వద్ద పంట ఉత్పత్తులకు మద్దతు ధర కోసం ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులతో కేంద్ర ప్రభుత్వం చేయించిన దాడిని అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని రెవెల్యూషనరీ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ కోరారు. వర్ధన్నపేట, పర్వతగిరి మండల కేంద్రాల్లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రైతులు హక్కుల కోసం ఉద్యమిస్తుండగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అణచివేస్తోందని ధ్వజమెత్తారు. శాంతియుత చర్చల ద్వారా వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించడంతోపాటు మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.50 లక్షలు, గాయపడిన రైతులకు రూ.20 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ స్కూళ్ల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్: ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (వడుప్సా) ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును 3వ డివిజన్ పైడిపల్లిలో గురువారం వరంగల్ జోన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య ఆధ్వర్యంలో వడుప్సా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డితో కలిసి వడుప్సా ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలకు శాశ్వత ప్రభుత్వ గుర్తింపు ఇవ్వడం, పదో తరగతి పరీక్షల రుసుంను ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు అనుమతి, కమర్షియల్ క్యాటగిరీలో ఉన్న కరెంట్ మీటర్లను డొమెస్టిక్ మీటర్లుగా మార్చుట, ట్రేడ్ లైసెన్స్, ప్రొఫెషనల్ టాక్స్‌ల నుంచి మినహాయింపు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే యాజమాన్యాలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో వడుప్సా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి దండాపంతుల రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీ యాద విద్యాసాగర్, వరంగల్ జోన్ కార్యదర్శి జన్ను విలియం, జిల్లా ప్రెస్ అండ్ మీడియా కన్వీనర్ పంచకం నర్సయ్య, స్పోర్ట్స్ కన్వీనర్ జన్ను సంజీవ, వరంగల్ జోన్ జాయింట్ సెక్రటరీ నసీరుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉస్మాన్ అలీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కన్వీనర్ ఖలీల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎన్నిక



కమిటీతో నాయకులు

సంగెం : మండలంలోని కుంటపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా రౌతు నర్సయ్య, గౌరవ అధ్యక్షుడుగా పెంతల ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల శివరాజ్యం, సహాయ కార్యదర్శిగా పులుపాటి మధుసూదన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిర్ర గోపీ, ఉపాధ్యక్షులుగా జున్న యాకయ్య, రౌతు కోటి, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా జున్న రాజమల్లు, బీసీ సెల్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, యూత్ అధ్యక్షుడిగా కావటి రాజు, ప్రచార కార్యదర్శిగా జున్న రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చిర్ర సునీల్ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, జిల్లా నాయకులు గుమ్మడి హరిబాబు, జనగాం రమేశ్, తీగల రాజేశ్, దండు నరేశ్, గుండేటి రాజ్‌కుమార్, శ్రీకర్, వీరారెడ్డి, శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి 'మార్నేని'ని చేర్చుకోవద్దు

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీలో వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును చేర్చుకోవడానికి మండల నాయకులు అంగీకరించడం లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో మార్నేని చేరుతున్నారని, అందుకే ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఇటీవల కలిశారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఫంక్షన్‌హాల్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త తీవ్రంగా కష్టపడ్డారన్నారు. 20 సంవత్సరాలుగా మార్నేని రవీందర్‌రావు తెలుగుదేశం, బీఆర్ఎస్ పార్టీలో కొనసాగారని, అప్పటి నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు మార్నేనితో తీవ్రంగా ఇబ్బందులు పడ్డట్లు గుర్తుచేశారు. మార్నేని రవీందర్‌రావు కాంగ్రెస్‌లోకి రావడంపై ఏ ఒక్క కార్యకర్తకు ఇష్టం లేదని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ ఒడిదుడుకులను తట్టుకుని నిలబడ్డ నిఖార్సైన కార్యకర్తకు అన్యాయం జరుగుతుందని అన్నారు. పది సంవత్సరాలు పదవీ అనుభవించిన మార్నేని తన అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు, పెత్తనం చెలాయించేందుకు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎట్టి పరిస్థితిలో చేర్చుకోవద్దని మండల పార్టీ తీర్మానం చేసి అధిష్టానానికి పంపిస్తున్నట్లు తెలిపారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ మార్నేని వెంకటేశ్వర్‌రావు, నాయకులు చిరంజీవి, దేవేందర్‌రెడ్డి, మోహన్, మధు, చందర్‌రెడ్డి, స్వామి, భాస్కర్, సునీల్, రాజు, రహీంపాషా, రాజారాం, రఘువర్మ, మురళీ, రవీందర్, మోహన్, సాయి, సారయ్య, వెంకటేశ్వర్లు, మీర్ మహ్మద్ పాల్గొన్నారు.

హారిజంటల్ విధానాన్ని ఎత్తివేయాలి

హన్మకొండ: టీఎస్‌పీఎస్సీ నియామకాల్లో మహిళలను హారిజంటల్ విధానంలో ఎంపిక చేసే విధానాన్ని ఎత్తివేయాలని, వర్టికల్ విధానాన్ని అమలు చేయాలని మహిళా నిరుద్యోగులు డిమాండ్ చేశారు. మహిళలకు హారిజంటల్ విధానాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో మహిళా నిరుద్యోగులు, విద్యార్థినులు గురువారం ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా కోచింగ్ తీసుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న ఉద్యోగాల్లో హారిజంటల్ విధానాన్ని తీసుకురావడం వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. గత పాలకులు చేసిన తప్పిదాలనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మహిళలను దృష్టిలో పెట్టుకొని వర్టికల్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ మహిళలు మమత, అనూష, స్వాతి, అనిత, వసంత, కవిత, నిరుద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఆత్మకూరు : కుమారులు తన మాట వినడం లేదని మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తనుగుల పైడిద్ద(60) తన కుమారులు ఇంటి స్థలం పంపకం విషయంలో తనకు ఇష్టం లేకున్నా పెద్దమనుషుల వద్దకు వెళ్తామని చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన పైడిద్ద బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఆయన మృతిచెందాడు. మృతుని భార్య గోపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పట్టపగలే దొంగల బీభత్సం



చిందరవందరగా పడి ఉన్న సామగ్రి

రామన్నపేట: ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి మేడారం జాతరకు వెళ్లడాన్ని దొంగలు ఆసరా చేసుకున్నారు. నగరంలోని బ్యాంక్‌కాలనీలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గురువారం పట్టపగలే దోపిడీకి తెగబడ్డారు. తాళాలు పగలు గొట్టి నగలు, ఆభరణాలను చోరీ చేశారు. సాంబర రాజశేఖర్ ఇంటిలో రెండు తులాల బంగారం, 1.25 కిలో వెండి చోరీకి గురైందని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. అలాగే, అద్దె గృహంలోని గంగుల సంతోష్ ఇంటిలో రూ.70 వేల నగదును దొంగలు అపహరించారని వివరించారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం



హన్మకొండ: హసన్‌పర్తిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ 20వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పాన్నోజు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో గురువారం ప్రత్యేక చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, హసన్‌పర్తి మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు శీలం పృథ్వీరాజ్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, బీజేపీ 66వ డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, రైల్వే బోర్డు సభ్యుడు దాసరి రాజు, బీజేపీ యువమోర్చా డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.